క్లుప్తంగా

వైద్య వృత్తి పవిత్రమైంది


పట్టా అందుకుంటున్న వైద్య విద్యార్థులు

పెదవేగి : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, విలువలతో కూడినదని ఈ విషయాన్ని వైద్య విద్యార్థులు గుర్తుంచుకోవాలని విజయవాడ డాక్టర్ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో 17వ కాన్వకేషన్ - 2018 అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 2020 పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థులకు బుధవారం రాత్రి పట్టాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కోరుకొండ బాబ్జి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ జి మోజెస్, ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, కళాశాల అడ్మినిస్ట్రేటర్స్ ఫాదర్ ఫెలిక్స్, ఫాదర్ ఎం ధర్మరాజు, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్, వీడీఎంసీ ట్రస్ట్ నంబర్లు, ఫాదర్ ఐ మైకేల్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జి, బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు పట్టాలను అందించారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు.

దెందులూరులో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం

దెందులూరు: దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలందరి సౌకర్యార్థం ఎస్‌బీఐ ఖాతాదారులు సేవాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం నిర్వాహకులు శింగవరపు అన్వేష్ అన్నారు. బుధవారం దెందులూరులో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా తెరవడం, నగదు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం తదితర బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఫిక్సిడ్ డిపాజిట్లు చేసుకోవచ్చని, ఏ బ్యాంకులకు సంబంధించిన సేవలైనా వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం


భీమడోలులో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో దసరా సెలవుల నేపథ్యంలో నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం శిక్షణ తరగతులు నాల్గవ రోజుకు చేరాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. లైబ్రేరియన్లు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

పెదవేగి : పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులను పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథ పాలకుడు అరుణకుమార్ అన్నారు. దీనిలో భాగంగా బుధవారం చెస్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గీత కార్మికుడికి గాయాలు

పెదవేగి : తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి గ్రామానికి చెందిన తాతా సురేష్ బాబు బుధవారం ఉదయం తాటి చెట్టు పైనుంచి కల్లు దించుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సురేష్‌బాబు కుడికాలుకు తీవ్రగాయమైంది. దీనిని గమనించిన తోటి గీతకార్మికులు అతనిని ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుడికాలికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

20న ఆటోనగర్ ఎన్నికలు

ఏలూరు రూరల్: ఈ నెల 13న మల్కాపురం ఆటోనగర్‌లో కొందరు బయట వ్యక్తులు వచ్చి గలాటా సృష్టించడంతో వాయిదాపడిన ది ఏలూరు ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 20న నిర్వహించనున్నామని ఆటోనగర్ ఎన్నికల నిర్వహణ త్రిసభ్య కమిటీ సభ్యుడు ఆదాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఏలూరు సీఎస్‌ఐ స్కూల్ వద్ద అపోలో టైర్స్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆవరణలోని కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం పోలింగ్ పక్రియ చేపడతామన్నారు. సభ్యులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మరో సభ్యుడు కర్రి మహేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ సజావుగా సాగేందుకు పోలీసుల సహకారం కోరామన్నారు. పలువురు సభ్యులు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణంపై పలు ఆరోపణలు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శం

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


పెదపాడు: అప్పనవీడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందుల కిట్‌ను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


దెందులూరు: లబ్ధిదారులకు మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, నాయకులు


పెదవేగి: మందుల కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


గణపవరం: కళ్లజోడు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


భీమడోలు: కోరుకొల్లు వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి


నిడమర్రు: జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి, వైఎస్సార్ సీపీ నాయకులు

పెదపాడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పేదలకు ఇంటి వద్దే స్పెషలిస్టులతో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆమె తెలిపారు. అప్పనవీడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను, ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తుచేసారు. ఈకార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్, స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ,వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్ధే రామసీత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష

దెందులూరు: పేదలకు అండగా ప్రజలందరికీ తోడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. బుధవారం దెందులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ఆధ్వర్యం వహించారు. దెందులూరు శివారు గ్రామాల నుంచి వచ్చిన 896 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి, వైద్య బృందం, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య తెలిపారు. బుధవారం పెదవేగి మండలం అమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్యతోపాటు కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్లగొళ్ళ భూస్వామి, సర్పంచ్ దేవరపల్లి ఏసుమరియమ్మ ఏబేలురాజు, ఎంపీటీసీ యర్రా అనురాధ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు చందు సుబ్బారావు, జీవీ చంద్రశేఖర్, పరసా శివ, తహసీల్దార్ ఎన్ నాగరాజు, ఎంఈఓ 2 అరుణ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రసాద్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

గణపవరం: పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించడానికే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి అన్నారు. బుధవారం గణపవరం గ్రామ సచివాలయం -2 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె సర్పంచ్ మూర అలంకారంతో కలిసి ప్రారంభించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సీహెచ్‌వో జాలాది విల్సన్, పంచాయతీ కార్యదర్శి డీఆర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈశిబిరంలో వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి, టి.కిరణ్మయి, రషీద్, చైతన్య కిరణ్ 1,800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 160 మందికి కంటిపరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వ కృషి చేస్తోందని ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. కోరుకొల్లు సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆర్డీవో ప్రారంభించారు. సచివాలయం పరిధిలోని కోరుకొల్లు, లక్ష్మీపురం, బద్రికోడు, పైడిదిబ్బ, కాళింగు పేటలో వైద్య బృందాలు కూపన్లు అందించడంతో 380 మంది ఈ వైద్య శిబిరానికి హాజరయ్యారు. వైద్యులు వారికి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మందులు అందించారు. పౌష్టికాహార స్టాల్‌ను ఆర్డీవో సందర్శించారు. తొలుత కోరుకొల్లు సర్పంచ్ దాట్ల సుబ్బలక్ష్మీ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. హెల్ప్‌డెస్క్, వైద్యులు విభాగాలను ఆయన సందర్శించారు. రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించి పలు సూచనలందించారు. పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు గొల్ల సాయికుమార్, గైనిక్ కె.సాహితి, కంటి వైద్య నిపుణులు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ దండు శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీటీసీ తోటకూర రామలింగరాజు, గ్రామ కార్యదర్శులు మురళీ, లావణ్య, వీఆర్వోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నిడమర్రు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు అందరూ వినియోగించుకోవాలని నిడమర్రు జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి కోరారు. పెదనింద్రకొలను గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జెడ్పీటీసీ కాశి ప్రారంభించారు. ఈ సందర్భంగా 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, వైఎస్ ఎంపీపీ బండి రమణ విస్సాకు, చినిమిల్లి నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శి వేగేశ్న వెంకట సుబ్బరాజు, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు అల్లాడి అబ్బులు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, సచివాలయాల కన్వీనర్లు పుప్పాల సుబ్బా రావు, ముగ్గళ్ల ఇబ్రాయెలు, కోటి గోవింద్, కచ్చాల శ్రీనువాసు, ఆవాల రాంబాబు, తాహసీల్దారు బి. సాయిరాజు, ఎంపీడీవో విజయకుమారి, కార్యదర్శి సీహెచ్ సునంద తదితరులున్నారు.

దుర్గమ్మ ఆలయాల్లో విశేష పూజలు


భీమడోలు: గుండుగొలనులో వెండి చీర అలంకరణలో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి


దెందులూరు: గోపన్నపాలెంలో దుర్గ మ్మకు జలాభిషేకం చేస్తున్న భక్తులు


దెందులూరు: మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు


పెదపాడు: వట్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అంబికాదేవి ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారు

భీమడోలు: మండలంలోని భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, నరేడ్లగూడెంలోని ఆలయాల్లో అమ్మవార్లు నాల్గవ రోజైన బుధవారం విశేష పూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. పంచామృత నవరస ఫల అభిషేకాలు, లక్ష కుంకుమార్చన పూజలు చేసారు. గుండుగొలనులో పురాతన దేవాలయం భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు వెండి చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలువేల్పు భవానమ్మ తల్లి శ్రీమహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరించారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.

వైభవంగా కనకదుర్గమ్మకు పూజలు

గణపవరం: స్థానిక కంచి కామాక్షి కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. చినరామచంద్రపురం కనకదుర్గ ఆలయంవద్ద దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సరిపల్లె దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద, పిప్పర, గణపవరం సలాదివారి వీధిలో కనకదుర్గ ఆలయం వద్ద దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయం, భీమేశ్వరస్వామి ఆలయంలో కాపులరామాలయంలో, చిన్న చల్లాలమ్మ ఆలయంలో, తూర్పు కాపుల కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్నారు. బుధవారం చిన్న చల్లాలమ్మ ఆలయం వద్ద శ్రీకృష్ణ, గీతా సమాజం మహిళలు దేవీ అమ్మవారి పారాయణ చేశారు. నారాయణపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్నారు.

108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం

దెందులూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా గోపన్నపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు కొండేటి హనుమంతు, చిన్నవెంకన్న, రాముడు, అచ్చారావు, జోజిబాబు అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి 108 బిందెలు, 108 కలశాలతో పంచామృతాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం నిర్వహించారు. సర్పంచ్ కోటే నాగ మల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీ ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మందలపర్రు పంచాయతన క్షేత్రంలో..

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బువ్వనపల్లి వడలమ్మ అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజల్లో 200 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం వద్ద ఉమాదేవి అమ్మవారు రూ.50 లక్షల విలువైన కరెన్సీతో ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీగా అంబికా దేవి

పెదపాడు: మండలంలోని వట్లూరు అంబికాదేవి ఆలయంలో అమ్మవారిని బుధవారం మహాలక్ష్మి అమ్మవారుగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ నిర్వహకులు అంబికా ప్రసాద్, అంబికా కృష్ణ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గౌడ సంఘ నేతల ఆత్మీయ సమావేశం


పెదవేగిలో సమావేశమైన గౌడ సంఘ నేతలు

పెదవేగి : పెదవేగిలో మాజీ దెందులూరు నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ మేక లక్ష్మణరావు ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘీయుల సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల అక్టోబర్ 6న నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడిగా విజయరాయి గ్రామానికి చెందిన మట్టా గోపాలరావు తనయుడు మట్టా రమాశంకర్‌ను, రాష్ట్ర గౌడ సంఘ చైర్మన్ జోగి రమేష్ ఆధ్వర్యంలో నియమించారని చెప్పారు. నియోజకవర్గ గౌడ సంఘ ప్రెసిడెంట్ మట్టా రమాశంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 4 మండలాలకు గౌడ సంఘ అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గౌడ సంఘ చైర్మన్ జోగి రమేష్, మేకా శేషుబాబు, అంగర రామమోహన్, ఎంపీ మార్గాని భరత్, కొనకళ్ళ నారాయణ , కొనకళ్ళ జగన్నాథ రావు (బోల్లయ్య), అనగాని సత్యప్రసాద్, ఉప్పాల హారిక రాము, మన ఏపీ రాష్ట్ర గౌడ సంఘ స్టేట్ కమిటీ సభ్యులు, దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ సభ్యులందరితో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఆ సభలో దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ పూర్తి కమిటీని ప్రకటిస్తామని అధ్యక్షుడు మట్టా రమా శంకర్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ దెందులూరు నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ మేక లక్ష్మణరావు, తాత సత్యనారాయణ, పెదవేగి మండల ఎంపీపీ రమ్యప్రసన్నకుమార్, మేకా వసంతరావు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ మట్టా నవీన్, చల్లారి నాగబాబు, పరసా రంగారావు, చిట్టిబొమ్మ జగదీష్ పాల్గొన్నారు.

నేడు కొవ్వలిలో జగనన్న ఆరోగ్య సురక్ష

దెందులూరు: కొవ్వలిలో గురువారం సర్పంచ్ ఇంటేటి మధులత అధ్యక్షతన ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి రంగారావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు దెందులూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. కొవ్వలిలో మొటపర్తి భవన్‌లో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉంగుటూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఉంగుటూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: పదవిలో ఉన్నప్పుడు మంచి పనులు చేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం లభిస్తుందని, ఆ దిశగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పని చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఉంగుటూరులో మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ తాను సర్పంచిగా ఉన్నపుడు ఆనాటి ఎమ్మెల్యే రంగనాథరాజు సూచన మేరకు పేదలకు ఇళ్ల కాలనీ నిర్మించానని, మళ్లీ ఎమ్మెల్యే హోదాలో పేదలకు ఇళ్లు నిర్మించే అవకాశం వచ్చిందని అన్నారు. గృహ నిర్మాణ పనులను గ్రామంలోని ప్రజలు ఈనాటికీ గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం ఇళ్ల నిర్మాణంలో ఏలూరు జిల్లాలోనే ప్రథమంలో నిలిచిందని అన్నారు. ఉంగుటూరు మండలంలో రహదార్ల అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లు కేటాయించి అభివృద్ధికి సహకరించిన ఎంపీపీ గంటా శ్రీలక్ష్మిని వాసుబాబు అభినందించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులందరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకాన్ని పునర్నిర్మించాలని వెల్లమిల్లి సర్పంచి కూమార్‌రాజా కోరారు. రూ.68 లక్షల నిధులు కేటాయించి, టెండర్లు ఆహ్వానించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు చెప్పారు. నల్లమాడు సర్పంచి గౌతురాము మాట్లాడుతూ గ్రామంలోని రక్షిత నీటి పథకాన్ని ఆధునీకరించాలని కోరారు. ఉప్పాకపాడు సర్పంచి నేదూరి అబ్బులు, దొంతవరం సర్పంచి సరిబాబు, యర్రమిల్లిపాడు సర్పంచి తమ్మిన శ్రీను, చేబ్రోలు సర్పంచి రందే లక్ష్మీ సునీత ఆయా గ్రామాల సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో ప్రేమాన్విత, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, తహసీల్దారు వెంకటరమణ, పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి, వైస్ ఎంపీపీలు విద్యాలక్ష్మి, సింగిరెడ్డి సూర్యనారాయణ ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.